## స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు



2 లో


# ప్రజాపక్షం

PRAJAPAKSHAM

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 16 | మే | 2024

పేజీలు 7


# తునికాకు కోతల వేళ..

- ఆరు డివిజన్లలో మొదలైన తునికాకు సేకరణ
- 35100 బ్యాగుల సేకరణే లక్ష్యం
- 50 ఆకులకట్టకు రూ.3
- ప్రమాదానికి బీమా
- 50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలని డిమాండ్





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గిరిజనుల వేసవి పంట తునికాకు కోతలు మొదలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ రేంజ్ పరిధిలో తునికాకు సేకరణ కోసం చేసిన ప్రూనింగ్ పనులు పూర్తి కావడంతో ఆకు కోతలు మొదలుపెట్టారు. నెల రోజుల పాటు ఏజెన్సీలో గిరిజనులతో పాటు గిరిజనేతరులు సైతం తునికాకు సేకరణలో బిజీబిజీగా ఉంటారు. ఈ ఏడాది 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 చెల్లించేందుకు ప్రభుత్వం మొగ్గుచూపింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు డివిజన్ల పరిధిలో 35100 స్టాండర్డ్ బ్యాగుల ఆకు సేకరణ లక్ష్యంగా ఇందు కోసం 667 కల్లాలు ఏర్పాటు చేశారు. ఆకు సేకరణ సమయంలో ప్రమాదాల భారిన పడి వారిని ఆదుకునేందుకు ఎప్పటి మాదిరిగానే బీమా

మిగతా 2లో..

## ‘సీతారామ’ ద్వారా 10లక్షల ఎకరాలకు నీరు

-ఆగస్టు 15 నాటికి వైరాకు గోదావరి నీరు

-వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు



2 లో

## రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

ప్రాణాలకు తెగించి మరో ఇద్దరిని కాపాడిన 108 సిబ్బంది







2 లో

# తునికాకు కోతల వేళ..



(మొదటిపేజీ తరువాయి)

చెల్లించనున్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత గిరిజనులతో పాటు గిరిజనేతరులు జిలాల్లో తునికాకు సేకరించేందుకు సిద్ధమవుతుంటారు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు జిలాల్లోని ఆరు డివిజన్లలో ఆకు సేకరణ మొదలు పెట్టారు. ఆకు సేకరించేందుకు గ్రామాల ప్రజలు అడవిబాట పడుతుంటారు. సేకరించిన ఆకును ఆరబెట్టి కట్టలు కట్టి కట్టలు కట్టి కళ్లాలకు ఇస్తుంటారు.

**ఆరు డివిజన్లలో...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం ఆరు డివిజన్లలో తునికాకు సేకరణ జరుగుతోంది. భద్రాచలం, పాల్వంచ, కిన్నెరసాని అభయారణ్యం, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు డివిజన్లు ఉన్నాయి. వీటి మొత్తంగా 35100 స్టాండర్డ్ బ్యాగుల సేకరణ లక్ష్యంతో గిరిజనులు ఆకు కోతలు మొదలు పెట్టారు.

**50 ఆకుల కట్టకు రూ.3...**

50 ఆకుల తునికాకు కట్టకు రూ.3 చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. గత ఏడాది 2.10 పైసలు చెల్లించిన ప్రభుత్వం ఇప్పుడు రూ.3 చెల్లించేందుకు సిద్ధపడింది. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు పోలిస్తే ఇది ఎటూ సరిపోదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదబీమా...**

ఆకు సేకరణ సమయంలో అటవీ జంతువుల భారిన పడి మరణించిన, ఇతర ప్రమాదాలు చోటు చేసుకున్నా... ప్రభుత్వం బాధితులకు బీమా చెల్లించనుంది. జంతువులు అడవిలో లభ్యమయ్యే తునికాకు, ఇతర కాయల కోసం వచ్చిన సమయంలో ఆకు సేకరించేందుకు వెళితే సహజంగా దాడి చేస్తుంటాయి. గడిచిన ఆదేళ్లుగా నలుగురు తునికాకు కార్మికులు మృత్యువాత పడ్డారు. వారికి ప్రభుత్వం తరుపున బీమా అదించారు.

**గాలికట్టల దోపిడీ...**

గిరిజనులు గాలికట్టల దోపిడీకి గురవుతున్నారు. ఈ పేరుతో కాంట్రాక్టర్ పెద్ద ఎత్తున ఆకు కార్మికులను మోసం చేస్తుంటారు. కల్లేదారులను మచ్చిక చేసుకునే కాంట్రాక్టర్లు 50 ఆకుల కట్టకు బదులుగా 60 నుండి 70 ఆకులు కట్టాలని ఒత్తిడి తేస్తుంటారు. దీంతో గిరిజనులకు భారీ నష్టం వాటిల్లుతోంది. వీరికి అటవీ అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో దోపిడీ యదేశ్చగా సాగిపోతోంది.

**50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలి...**

50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలని పలువురు తునికాకు కార్మికులు కోరుతున్నారు. ప్రభుత్వం చెల్లించే రూ.3 ప్రస్తుత ధరలకు ఎటూ సరిపోదని, మరో ప్రక్క కట్టకు ఆకులు ఎక్కువగా కట్టించుకుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ శ్రమను గుర్తించి నాణ్యమైన ఆకును సేకరించే తమకు 50 ఆకుల కట్టకు రూ.6 చెల్లించాలని, గాలి కట్టల దోపిడీ నుండి కాపాడాలని కోరుతున్నారు.

# 'సీతారామ' ద్వారా 10లక్షల ఎకరాలకు నీరు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 10లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు మండల కేంద్రం సమీపంలోని సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాల్వ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్ట్ లింకు కెనాల్ పూర్తయితే వైరా రిజర్వాయర్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు, త్రాగునీరు అందిస్తామని తెలిపారు. కెనాల్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని, కెనాల్ పనులకు రైతులు అడ్డు తగలవద్దు అని కోరారు. ఆగస్ట్ 15కల్లా వైరా రిజర్వాయర్‌కు నీరు విడుదల చేసి రైతులను ఆదుకుంటామని అన్నారు. కాంట్రాక్టర్ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని, రాత్రింబవళ్ళు సైతం పనులను కొనసాగించాలని కోరారు. సీతారామ ప్రాజెక్ట్ వలన 10లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తుంది. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే తన చిరకాల వాంఛ కోరిక నెరవేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామ ప్రాజెక్ట్ నీటిపారుదలశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మేడా ధర్మారావు, వేములు కృష్ణప్రసాద్, గుత్తా వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, స్వర్ణ ప్రహ్లాదరావు, ముక్తి వెంకటేశ్వర్లు, ఆది నర్సింహారావు, కట్టా సత్యనారాయణ, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి

**ప్రజాపక్షం/బోనకల్:** బోనకల్, ఖమ్మం ప్రధాన రహదారిపై కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో వృద్ధ దంపతులు అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని ముష్టికుంట్ల శివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఖమ్మం పట్టణంలోని మామిళ్లగూడెం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొత్తూరు సూర్యనారాయణ(95), సతీమణి కొత్తూరు రుక్మిణి(90) కొద్దిరోజుల క్రితం మధిరలోని తమ కూతురు వద్దకు వచ్చారు. మనవడు కొత్తూరు అనిల్ కారులో తాత, నాయనమ్మలైన సూర్యనారాయణ, రుక్మిణి, కేర్‌టేకర్ నాగరాజులను ఖమ్మం తీసుకెళ్తున్నాడు. కారులో బోనకల్ మీదుగా ఖమ్మం వెళ్తుండగా మార్గమధ్యలోని ముష్టికుంట్ల గ్రామం వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. కారులో ఉన్నవారిని కాపాడేందుకు రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు కారు డోర్లను తెరిచేందుకు ప్రయత్నించారు. కానీ మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున వ్యాపిస్తుండంతో కారు పేలిపోతుందేమోనని భయపడి కార్ల డోర్లను తెరిచే సాహసం చేయలేకపోయారు. దీంతో బోనకల్ వైపు వస్తున్న 108 అంబులెన్స్ సిబ్బంది ప్రాణాలకు తెగించి ఫైర్ ఎక్స్‌సీటర్‌తో కొంత వరకు మంటలను అర్పి అంబులెన్స్‌లోని అత్యవసర పరికరాలతో డోర్లను తెరిచి వృద్ధ దంపతులను, ఇద్దరు యువకులను బయటకు తీశారు. అప్పటికే వృద్ధదంపతులు సూర్యనా




రాయణ,రుక్మిణిలు మృతిచెందగా, కేర్‌టేకర్ నాగరాజు తీవ్రగాయాలయ్యాయి. అనిల్‌కు స్వల్ప గాయాలు కావడంతో అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ కె మధుబాబు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రాణాలకు తెగించి కారు డోర్ల తెరిచి ఇద్దరు యువకులను కాపాడిన పైలేట్ కాలసాని వెంకట్రావ్ , ఎమెర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ మాతెపోగు రామకష్ణలను మండల అధికారులు అభినందించారు.

# స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్/ఖమ్మం రూరల్ :** స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం పార్లమెంటు నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. బుధవారం రిటర్నింగ్ అధికారి ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను సందర్శించి భద్రతలను పరిశీలించారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించి విధుల్లో ఉన్న సాయుధ బలగాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూం ల వద్ద ఏర్పాటు చేసిన లైట్లు 24 గంటలు ఆన్‌లో ఉంచాలన్నారు. స్ట్రాంగ్ రూం సిసి కెమెరాల వ్యూ కోసం ఏర్పాటు చేసిన ఎల్ఈడి తెరలను పరిశీలించి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్ట్రాంగ్ రూంల పరిశీలనకు ఎంట్రీ పాస్ ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లకు అనుమతించాలని ఆయన తెలిపారు. లెక్కింపు కేంద్రాల ఏర్పాటు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ ఐపిఎస్ మౌనిక, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, అదనపు డిసిపి ప్రసాదరావు, ఆర్అండ్‌బి ఎస్ఈ శ్యాంప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాయ్ రాజా కాయ్..!

**- ఆంధ్ర ఎన్నికల ఫలితాలపై కోట్లల్లో బెట్టింగ్‌లు..?**

**ప్రజాపక్షం/ మధిర :** మే 13 జరిగిన ఎన్నికల నేపథ్యంలో జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్‌ల జోరందుకుంది. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన మధిర, సత్తుపల్లి పలు నియోజకవర్గాల్లో ఎపి ఎన్నికల ఫలితాలపై కోట్లల్లో బెట్టింగ్‌లు పెడుతున్నట్లు సమాచారం. ఎపితో పాటు తెలంగాణలో కూడా బెట్టింగ్ రాయుళ్లు కోట్లల్లో బెట్టింగ్‌లు పెడుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఎపిలో వైసిపి, టిడిపి కూటమి మధ్య నువ్వా, నేనా అన్నట్లుగా రసవత్తరంగా ఎన్నికలు సాగాయి. దీంతో బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగి కాయ్ రాజ్ కాయ్ అంటూ బెట్టింగ్‌ల పర్వాన్ని మొదలు పెట్టారు. ఎపిలో అధికారంలోకి వచ్చే పార్టీ ఏది, ఎన్ని సీట్లు వస్తాయి, ఏ నియోజకవర్గంలో ఎవరు గెలుస్తారు, ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ వస్తుంది ఇలా పలు కోణాల్లో బెట్టింగ్ రాయుళ్లు బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఎపిలోని పల్నాడు, కడప జిల్లాల్లో అభ్యర్థులు, స్థానాలతో పాటు చంద్రబాబు పోటీచేసిన కుప్పం, నారా లోకేష్ పోటీ చేసిన మంగళగిరి, పవన్‌కళ్యాణ్ పోటీ చేసిన పిఠాపురంలో గెలుపోటములు, మెజార్టీలపై భారీ ఎత్తున బెట్టింగ్‌లు జరగుతున్నట్లు సమాచారం. ఎపిలో సుమారు 82



శాతం పోలింగ్ నమోదవటంతో టిడిపి కూటమికి, వైసిపికి అధికారం చేపట్టేందుకు సమాన అవకాశాలు ఉండటంతో బెట్టింగ్‌ల జోరందుకున్నాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసే పార్టీపై ఒక లక్షకు 5లక్షల చొప్పున బెట్టింగ్‌లు పెడుతున్నారని పలువురు తెలుపుతున్నారు. కింద స్థాయి నుండి పై స్థాయి వరకు వారి వారి స్థోమతకు తగినట్లుగా రూ.50వేల నుండి కోటి రూపాయల వరకు పందాలు కాస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వంపైనే ఎక్కువగా పందాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు.

# రాయల శేషగిరిరావు మృతి పట్ల పువ్వాడ సంతాపం

**ప్రజపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఖమ్మం జిల్లా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మృతి పట్ల సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తాను ఒక మంచి మిత్రున్ని కోల్పోయానని, 30 ఏళ్లుగా రాయల శేషగిరిరావుతో తనకు మంచి అనుబంధం ఉందని పువ్వాడ తెలిపారు. రాజకీయాల్లో అంచలంచెలుగా శేషగిరిరావు ఎదిగారు. ఎంపిపిగా ఖమ్మంజిల్లా డిసిఎంఎస్ ఛైర్మన్‌గా పనిచేసి ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# ఆర్టిసికి రూ. 7.64 కోట్ల ఆదాయం



ఖమ్మం రీజినల్ మేనేజర్ వెంకన్న



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఖమ్మం రీజియన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రూ. 7.64 కోట్ల ఆదాయం లభించిందని ఖమ్మం రీజినల్ మేనేజర్ సిహెచ్ వెంకన్న బుధవారం తెలిపారు. ఈనెల 13న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి తమ సొంత ప్రాంతాలకు తరలి వచ్చిన ఓటర్లను తరలించడానికి చేసుకున్న ముందస్తు ప్రణాళిక కారణంగా రూ. 7.64 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈనెల తొమ్మిది నుంచి 14వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మంజిల్లా వ్యాప్తంగా ఆరు రోజుల్లో 519 బస్సుల ద్వారా 12.34 లక్షల కిలో మీటర్లు బస్సులు నడిపినట్లు ఆయన తెలిపారు. వీటి ద్వారా రూ. 7.64 కోట్లు ఆదాయం, 97 శాతం ఆక్యూపెన్సీ వచ్చిందన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి భారీగా తరలి వచ్చే ఓటర్ల రద్దీని ముందస్తుగానే ఊహించి దీనికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అధికారులు, సూపర్ వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లను సమన్వయం చేసుకోవడం ద్వారా అధిక ఆదాయాన్ని సాధించడం జరిగిందన్నారు. సంస్థ ఆదాయానికి కృషి చేసిన ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. వేసవి దృష్ట్యా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనప్పటికీ ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా బస్సులను నడపడంలో సహకరించిన కండక్టర్లు, డ్రైవర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో అత్యధిక ఆక్యూపెన్సీని నమోదు చేసిన కొత్తగూడెం (106 శాతం), ఖమ్మం (99 శాతం) డిపోల అధికారులు, సూపర్ వైజర్లు, సిబ్బందిని ఆర్ఎం అభినందించారు. ఖమ్మం డిపో పరిధిలో 133 బస్సుల ద్వారా ఆరు రోజుల పాటు 3.12 కిలో మీటర్లు నడిపి రూ. 2.12 కోట్లు ఆదాయం, మధిర డిపో పరిధిలో 60 బస్సుల ద్వారా 1.40 లక్షల కిలో మీటర్లు నడిపి రూ. 81.50 లక్షలు, సత్తుపల్లి డిపో పరిధిలో 97 బస్సుల ద్వారా 2.20 లక్షల కిలో మీటర్లు నడిపి రూ. 1.36 కోట్లు, భద్రాచలం డిపో పరిధిలో 87 బస్సుల ద్వారా 2.27 లక్షల కిలో మీటర్లు నడిపి రూ. 1.38 కోట్లు, కొత్తగూడెం డిపో పరిధిలో 60 బస్సుల ద్వారా 1.31 లక్షల కిలో మీటర్లు నడిపి రూ. 88.03 లక్షలు, మణుగూరు డిపో పరిధిలో 64 బస్సుల ద్వారా 1.61 లక్షల కిలో మీటర్లు నడిపి రూ. 96.74 లక్షలు, ఇల్లందు డిపో పరిధిలో 18 బస్సుల ద్వారా 42 వేల కిలో మీటర్లు నడిపి రూ. 22.83 లక్షలు ఆదాయం వచ్చిందని ఆర్ఎం తెలిపారు.

# డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ శేషగిరిరావు మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాయల వెంకట శేషగిరిరావు హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు బిఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో ఉన్న రాయల శేషగిరిరావు భౌతికా యాన్ని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, మాజీ ఎంఎల్ఎలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని, ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# ఘనంగా సిస్టర్ మేడికొండ మరియమ్మ వీడ్కోలు




**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్‌లోని నాయుడుపేట గ్రామంలో గల కరుణగిరి పుణ్యక్షేత్రంలోని ఖమ్మం జిల్లా కతోలిక క్రైస్తవ సంఘంలో 50సం వత్సరాలుగా విద్య, వైద్య, సేవలు, క్రీస్తు బోధనలు అందిస్తూ తన కాలపరిమితి అయిపోయిన సిస్టర్ మేడికొండ మరియమ్మను సంఘం ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మానాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూతన బిషప్ సగిలి ప్రకాష్, కర్నూల్ బిషప్ గోరంట్ల జొనేస్, నల్గొండ మాజీ బిషప్ గోవిందుజోజిలు హాజరయ్యి ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. అలాగే ఖమ్మం జిల్లా, మధిర మండలం బయ్యారం గ్రామానికి చెందిన మరియమ్మ వీడ్కోలు, కుటుంబ సభ్యులు, అక్కడి విశ్వాసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ చర్చి ఫాదర్లు మట కన్యలు, రెవరెండర్ ఫాదర్ ఫ్రాన్సిస్, స్లీవప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం మార్కెట్‌లోకి మహీంద్ర ఎక్స్‌యువి 3ఎక్స్‌వో విడుదల



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహీంద్ర మహీంద్ర కంపెనీ నూతన మోడల్ మహీంద్ర ఎక్స్‌యువి 3ఎక్స్‌వో వాహనాన్ని ఖమ్మం మార్కెట్ లోకి విడుదల చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ వద్ద గల మహీంద్ర కంపెనీ ఆధీకృత డీలర్ వివిసి మోటార్స్ లో జరిగిన కార్యక్రమంలో ఖమ్మం ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మహీంద్ర ఎక్స్‌యువి 3ఎక్స్‌వో మోడల్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఏసిపి మాట్లాడుతూ ఖమ్మం మార్కెట్‌లోకి వచ్చిన ఎక్స్‌యువి 3ఎక్స్‌వో చూడటానికి స్టైలిష్‌గా ఉందన్నారు. వివిసి మోటార్స్ యాజమాన్యం ఖమ్మంలో ట్రాఫిక్ పై అవగాహన కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నారని ఈ సందర్భంగా వారిని అభినందించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ముఖ్యంగా వెహికిల్స్ టర్న్ చేసేటప్పుడు ఇండికేటర్స్‌ను ఉపయోగించాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ఈ మధ్య ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్లాలని లేదా 108కు సమాచారం అందించాలని తెలిపారు. వివిసి మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ వంకాయలపాటి రాజేంద్ర ప్రసాద్ వర్చ్యువల్ ద్వారా మాట్లాడుతూ మహీంద్ర అండ్ మహీంద్ర కంపెనీ తమ వాహనాలకు సంబంధించి సేఫ్టీ విషయంలో చాలా అడ్వాన్స్‌గా ఉంటాయని తెలిపారు. సేఫ్టీ, మైలేజ్‌ను దృష్టిలో పెట్టుకుని అడ్వాన్స్ ఎస్‌యువి విభాగంలో ఎక్స్‌యువి 3ఎక్స్‌వోను విడుదల చేసిందన్నారు. ఇది మధ్య తరగతి వారికి అందుబాటు ధరలో ఉందన్నారు. లీటరుకు 20 కిలో మీటర్లు పైగా మైలేజ్ ఇస్తుందని తెలిపారు. దీని ఎక్స్ షోరూం ధర రూ. 7.49 లక్షల నుండి రూ. 15.49 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. డీజిల్, పెట్రోల్ వెర్షన్‌లో 25 వెరియంట్లలో సింగిల్, డ్యూయల్ రంగుల్లో లభ్యమవుతాయని తెలిపారు. మ్యానువల్, ఆటోమెటిక్ వెరియంట్‌తో పాటు నాలుగు డిస్క్‌బ్రేకులు, వాయిస్ కంట్రోల్ (అలెక్సా)తో లభిస్తుందన్నారు. బుకింగ్స్ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో వివిసి మోటార్స్ అన్ని షోరూంలలో ప్రారంభమయ్యాయని వీటిని వినియోగదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపు ఖమ్మం రూరల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రేపు(శుక్రవారం) ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించనున్నారని మంత్రి క్యాంపు కార్యాల ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు రెడ్డిపల్లి(మారెమ్మతల్లి గుడి),8:30కు పల్లెగూడెం, 9కు పోలెపల్లి, 9:30కు గోళ్ల పాడు, 10కు తీర్థాల, 10:30కు మద్దివారిగూడెం, 11కు పోలిశెట్టిగూడెం, 11:30కు మంగళగూడెం, మధ్యాహ్నం 12కు గుండాలతండా, 12:30కు తనగంపాడు, 1కు గూడూరుపాడు, 1:30కు ఎంవీ.పాలెం, 2:30కు కాచిరాజుగూడెం, 3కు కస్నాతండా, 3:30కు రేగులతండా, సాయంత్రం 4కు ఆరెకోడుతండా, 4:30కు చింతపల్లి, 5కు ఆరెకోడు, 6కు ముత్తగూడెం, 6:30కు గోల్లగూడెం, రాత్రి 7కు బారుగూడెం, 7:30కు ఆరెంపులలో పర్యటనలు ఉన్నాయి. కావునా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాల్సిందిగా కోరారు.

# శేషగిరిరావు మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ సంతాపం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, బిఆర్ఎస్ నాయకులు రాయల వెంకట శేషగిరిరావు బుధవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి బాధాకరమని వారితో ఉన్న సన్నిహిత్యాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

**ఎంపి నామ సంతాపం...**

బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మృతి పట్ల ఖమ్మం ఎంపి, లోక్‌సభ బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు నామ నాగేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. గత 20 ఏళ్లుగా శేషగిరిరావుతో ఉన్న రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రాయల శేషగిరిరావు కృషి చేశారన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

**ఎంపి వద్దిరాజు రవిచంద్ర సంతాపం...**

ఖమ్మం డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఖమ్మంజిల్లాకు, బిఆర్ఎస్‌కు ఆయన విశేష సేవలు అందించారని వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఆయన మృతి బిఆర్ఎస్ పార్టీకి, ఖమ్మంజిల్లాకు తీరని లోటన్నారు. శేషగిరిరావు కుటుంబ సభ్యులకు ఎంపి వద్దిరాజు రవిచంద్ర ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

# పలు కుటుంబాలకు నందిని పరామర్శ



**ప్రజాపక్షం/ చింతకాని :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని విక్రమార్క బుధవారం చింతకాని మండలంలో పర్యటించారు. తిమ్మినేనిపాలెం గ్రామ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ నబీ భార్య సమీనా అనారోగ్యంతో బాధపడుతుంటే వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం నాగులవంచ గ్రామానికి చెందిన అంబటి శాంతయ్య తండ్రి ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు అంబటి వెంకటయ్య దశదిన కర్మలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి మృతి పట్ల కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్, కిలారి మనోహర్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మందు కోసం వచ్చి... మందు తాగి వృద్ధురాలి మెడలో బంగా రం గొలుసు చోరీ కి పాల్పడ్డ ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితు రాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని చెన్నారం గ్రామం కు చెందిన అర్వపల్లి రాజ్యలక్ష్మి (65) ఇంట్లో బెల్ట్‌షాపు నిర్వహి స్తారు. మందు కోసం బైక్ పై ఇరువురు యువకులు మందు తాగారు. ఇలా మూడు సార్లు మందు కోసం ఇంటికి వచ్చారు. రెక్కీ నిర్వహించి ఇంట్లో అనారోగ్యంతో ఉన్నా భర్త తో పాటు వృద్ధరాలు మాత్రమే ఉన్నారని గ్రహించి ఏకంగా బలవంతంగా మెడలో ఉన్న దాదాపు మూడున్నర తులాల బంగారం గొలుసు లాక్కెళ్లారు. అరుపులు కేకలు వేయటంతో చుట్టు ప్రక్కల వారు వచ్చేసరికి నెంబర్ ప్లేట్ లేని బైక్ పై ఇరువురు దుండుగులు పారిపోయారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

## అనారోగ్యంతో తల్లాడ తొలి ఎంపిపి మృతి



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండల తొలి ఎంపిపి, ఖమ్మం జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ , ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాయల వెంకట శేషగిరిరావు అనారోగ్యంతో హైద్రాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. తల్లాడ మండలం మిట్టపల్లికి చెందిన రాయల శేషగిరిరావు రాజకీయాల్లో తనకంటూ చెరగని ముద్ర వేసుకు న్నారు. రాజకీయ ప్రస్థానంలో ముగ్గురు ముఖ్యమం త్రులతో సన్నితంగా ఉండి తల్లాడ మండల ఖ్యాతిని చాటిజెప్పిన వ్యక్తిగా రాయల శేషగిరిరావు పేరు ప్రజల్లో ఉంది. ఎన్టీఆర్ టిడిపి నుండి మధిర అసెంబ్లీకి రాయల శేషగిరిరావు పోటీ చేశారు. ఆతర్వాత మరల తెలుగుదేశంలో కొనసాగి ఎన్నో పదువులు సైతం ఆయన నిర్వహించారు. మిట్టపల్లి సొసైటీ అధ్యక్షుడిగా ఉండి బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లా డిసిసిబి చైర్మ న్‌గా విధులు నిర్వహించారు. ఇటీవల కాలంలో రాయల శేషగిరిరావు అనారోగ్యంతో బాధ పడటంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధ వారం మృతి చెందగా మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్సీ తాతా మధు, జెడ్పి చైర్మన్ లింగాల కమల్‌రాజు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరరావు భౌతికాయాన్ని సంద ర్శించి కుటుంబసభ్యులను ఓదార్చారు. తల్లాడ మండలం మిట్టపల్లిలో గురువారం రాయల శేషగిరిరావు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

**పలువురు సంతాపం...**

రాయల శేషగిరిరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సిపిఐ జాతీయ నాయకులు భాగం హేమంతరావు, పోటు ప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమై దయానంద్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బాణోత్ మదన్‌లాల్, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, తెలంగాణ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ చైర్మన్ బొర్రా రాజశేఖర్, తల్లాడ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, జక్కంపూడి కృష్ణమూర్తి, దేవర వెంకటలాల్, రాయల రాము, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

## అంబటి వెంకటయ్యకు పలువురు నివాళి



ప్రజాపక్షం/ చింతకాని : నాగులవంచ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అంబటి వెంకటయ్య దశదిన కర్మ సందర్భంగా పలు పార్టీల నాయకులు వెంకటయ్య చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివా ళులర్పించిన వారిలో ఎంపిపి పూర్ణయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, నాయకులు కిలార్ మనోహర్‌బాబు, మడుపల్లి భాస్కర్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, బారాస మండల అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య, వైస్ ఎంపిపి హన్మంత రావు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంకాయలపాటి వెంకటలచ్చయ్య, నాయకులు మంకెన రమేష్ తదితరులు ఉన్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రఘునాథపాలెం మండల పరిధిలోని పరికలబోడు తండాలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బానోత్ శ్రీను అనే వ్యక్తికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి విడి విడిగా ఉంటున్నారు. శ్రీను తల్లిదండ్రుల వద్ద ఉంటూ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. శ్రీను కుమారుడు అజయ్‌కుమార్ రెండున్నర ఏళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి శ్రీను మానసికంగా బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురై మానసికంగా ఇబ్బందులు పడుతూ జీవితం పై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీను తమ్ముడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చెరువు మట్టి తోలకంలో నిబంధనలు పాటించాలి

**-అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం**
**-ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు**



ప్రజాపక్షం-నేలకొండపల్లి : చెరువు మట్టి తొలకాలలో నిబంధనలు పాటించాలని ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు సూచించారు. మండల కేంద్రంలోని తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...రైతులు చెరువు మట్టి ని నిబంధనల మేరకు మాత్రమే తొలుకోవాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ తవ్వి గుంతలు చేయవద్దని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు తవ్వాలని అన్నారు. అదే విధంగా చెరువులో పన చేసే ఉపాధి కూలీలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తవ్వకాలు చేపట్టాలని అన్నారు. పని చేసే ప్రాంతం కు దూరంగా మట్టిని తవ్వాలని ఆదేశించారు. అలా కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మండలం లోని 19 చెరువులలో రైతులు ధరఖాస్తు చేసుకున్నారని అన్నారు. చెరువుమాధారం 50, ముజ్జుగూడెం 50 , మండ్రాజుపల్లి30, సుర్ధేపల్లి లో 30 మంది రైతులు మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. యంత్రాలు వినియోగించే వారు నిబంధనలు ప్రకారం తవ్వకాలు చేపట్టాలని అన్నారు. చెరువులో గుంతలు లేకుండా సోసైటీ సభ్యులు కూడ దగ్గర ఉండి పర్యవేక్షించుకోవచ్చునని అన్నారు. నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

# పల్లెల్లో పెరిగిన ఓటింగ్





ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పల్లెల్లో ఓటింగ్ సరళి పెరగగా పట్నంలో ఓటింగ్ శాతం తగ్గింది. దీంతో పల్లెల్లో ఓట ర్లలో చైతన్యం పెరగగా పట్నంలో చైతన్యం లేక నిర్లక్ష్యంతోఓటింగ్ సరళి తగ్గిపోయినట్లు అధికారులు తెలుపుతున్నారు. మండలంలో ముచ్చారం లో 92 శాతం ఓటింగ్ సరళి రాగా అతి తక్కువ కల్లూరు 100వ కలాలివాడ పోలింగ్ కేంద్రంలో 65 శాతం మాత్రమే పోలింగ్ సరళి నమోదు అయినట్లు తహాశీల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. పల్లెల్లో 90 శాతం నుండి 92 శాతం వరకు నమోదైన గ్రామపంచాయ తీలు ముచ్చారం, పోచవరం, ఓబుల్ రావు బంజర ,వాచా నాయక్ తండ ,లోకారం రఘునాధ గూడెం గ్రామాలలో 90% పైన ఓటింగ్ సరళి వచ్చినట్లు అధికారులు సూచిస్తున్నారు అదేవిధంగా 18 పంచా యితీలలో 80 శాతం నుండి 90% లోపల ఓటింగ్ సరళి నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలుపుతున్నారు. తాళ్లూరు, చిన్న కోరుకొండి, తెల్లగారం, పెద్ద కోరుకొండి, చెన్నూరు ,యజ్ఞ నారాయణపురం, ఎర్ర బోయినపల్లి, జిడిపి పల్లి ,పాయపూరు, చంద్రుపట్ల, ముగ్గ వెంకటా పురం, నారాయణపురం ,లోకారం , పుల్లయ్య బంజర, కృష్ణయ్య బంజర, హనుమాతండా ,గోకారం లక్ష్మీ పురం, పల్లెల్లో ఉన్న 50 పోలింగ్ కేంద్రాలలో 80 నుంచి 92% వరకు ఓటింగ్ సరళి నమోదై నట్లు కల్లూరు మండల తహాశీల్దార్ తెలిపారు. పట్నంలో ఉన్న 13 బూతులలో 71 శాతం మాత్రమే నమోదు అయినట్లు సూచిస్తున్నారు. దీనివలన పల్లెల్లో ఓటర్ల పట్ల చైతన్య అధికం పట్నంలో చైతన్యం లేకపో వడం నిర్లక్ష్యం ఉందని అనుకుంటున్నారు. అదేవిధంగా పట్నంలో 13 పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓ నిర్లక్ష్యంతో ఒకే ఓటరుకు రెండుచోట్ల నమోదయి ఉన్నట్లు పట్టణంలో చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం బిఎల్వోల నిర్లక్ష్యం తో ఒకే ఓటరుకు కొందరికి రెండు చోట్ల ఓటు ఉండటంతో కల్లూరు పట్నంలో ఓటర్లు చర్చించుకుం టున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

# అందరి చూపు.. జూన్ 4 పైనే..



ప్రజాపక్షం/కల్లూరు: అందరి చూపు జూన్ 4 పైనే నెలకొని ఉంది. అభ్యర్థులు, నాయకులు, కార్యక ర్తలు ఓటర్లు అందరు కూడా జూన్ 4 పైనే ఆశలతో ఎదురుచూస్తూ ఉన్నారు. ప్రస్తుతం అభ్యర్థుల భవి తవ్యం గెలుపు ఓటమిలో పై మండల పరిధిలోని పలు గ్రామాలలో కార్యకర్తలు, నాయకులు జోరుగా బెట్టింగులు పెడుతున్నట్లు చర్చించుకుం టున్నారు. తెలంగాణ పార్లమెంటు ఎన్నికల్లో కాకుండా ,ఆంధ్ర పార్లమెంట్ శాసనసభ ఎన్నిక లపై కూడా బెట్టింగుల జోరు కొనసాగుతోంది. ఫలానా వ్యక్తి గెలుస్తాడు అనే నమ్మకంతో ఇరువురు వ్యక్తుల మధ్య ఒప్పందాలతో అగ్రిమెంట్లతో లక్షలాది రూపాయలు బెట్టింగులు మండలంలో కొనసాగుతున్నట్లు ఇరువురు పార్టీల మధ్య నాయకులు మధ్య చర్చలు కొనసాగుతున్నవి. స్త్రీ, పురుషులు ఓటింగ్ సరళని బట్టి కుల, మతాలవారీగా సర్వే నిర్వ హించి మెజార్టీపై తర్జన మర్జన పడుతున్నారు. ఇరువురు పార్టీలు వారు ఎవరెవరు ఎటు ఓటువేశారు అనే కార్యకర్తలు నాయకులు స్థానికంగా అంతర్గత సర్వేతో ఓటర్ల జాబితా ను ముందు పెట్టుకొని చేస్తున్నారు. పెరిగిన ఓటింగ్ శాతంతో తమకే లాభం చేకూరు తుందని ఆశతో అభ్యర్థులు దీనితో ఉన్నారు. ఓట్లు లెక్కింపు మరో 19 రోజులు ఉండటంతో ఎవరిదీ మాతో వారే ఉన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల కన్నా ఈ ఎన్నికలలో పోలింగ్ శాతం ఓటర్ల చైతన్యం అధికంగా ఉండటంతో తమకే గెలుపు తధ్యమని ఒకరు నొకరు చర్చించుకుంటున్నారు. మండల పరిధిలోని ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఓటర్ల జాబితాతో జల్లెడ పడుతూ మెజా ర్టీలను లెక్కిస్తున్నారు మండలంలో కల్లూరు పట్టణం మరియు చిన్న కోరుకోండి, మర్లపాడు, తాళ్లూరు, పోచవరం, చెన్నూరు, ముచ్చవరం, పెద్ద కోరుకొండి, పేరువంచ, బత్తులపల్లి తదితర గ్రామాలలో అధికార ప్రతిపక్ష నాయకులతో పాటు మరో జాతీయ పార్టీ కూడా మాకు ఓటింగ్ శాతం అనేది పెరిగిందటూ ఫోన్లో సమాచారం తీసుకుంటు న్నారు. గ్రామాలలో ఎంత మెజార్టీ వస్తుంది అనేది ప్రధాన పార్టీలనా యకులు అభ్యర్థులు తాజా సమాచారాన్ని నాయకులు, కార్యకర్తలు ద్వారా అభ్యర్థులు తీసుకుంటున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాపక్షం/కల్లూరు: సత్తుపల్లి నియోజకవర్గంలో త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను ఏర్పాట్లు పూర్తయినట్లు, అదే విధంగా ఓటర్ల జాబితా కూడా రెండు మూడు రోజుల్లో కార్యాలయంకు రానున్నట్లు ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ అధికారి రాజేంద్ర తెలిపారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏన్కూర్ లో రెండు కేంద్రాలు, కల్లూరులో నాలుగు పోలింగ్ కేంద్రాలు, పెనుబల్లి లో రెండు, సత్తుపల్లిలో 10 కేంద్రాలు, వేంసూరులో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికలకు 17,218 మంది పట్టభద్రులు తమ ఓటుకు దరఖాస్తులు చేసుకున్నారని ఆర్డీవో తెలిపారు. ఈనెల 27వ తేదీన జరిగే ఈ ఎన్నికలకు ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు మరో రెండు రోజుల్లో ఓటర్ల జాబితా పోలింగ్ సిబ్బంది వివరాలు పూర్తిగా తెలియపరుస్తానని పేర్కొన్నారు.

# చెట్లకు నిప్పు.. ప్రాణాలకు ముప్పు..!

**-నిప్పు..ముప్పుపై రైతులకేది అవగాహన**
**-చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు**
**-మండిపడుతున్న రైతు సంఘాల నాయకులు**





ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమ వుతున్నారు. పత్తి, మొక్కజొన్న, మిరప పంటల సాగు అనంతరం ఎండిన చెత్తకుప్పలకు రైతులు మంటలు పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కట్టడి చేయకపోవడంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు కూడా అగ్నికి ఆహుతి అవుతున్నాయి. రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రయాణి కులకు మండుతున్న చెట్లు యమపాశాలుగా మారుతున్నాయి. ఇటీవల మండలంలో ప్రధాన రహదారులపై మంటలు అంటుకున్న చెట్లు ఒక్క సారిగా కూలిపోవడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. కాలు తున్న వృక్షాలు రహదారులపై ఎప్పుడు పడ్డాతాయో అని ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. కూలిన చెట్లను తొలగించే వరకు గంటల తరబడి రహదారులపై వేచిఉండాల్సి వస్తుందని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోయేదాకా మండల సంబంధిత అధికారులు చోద్యం చూడడంపై మండల వాసులు, రైతు సంఘాల నాయకులు ఆగ్రహిస్తున్నారు. రహదారుల వెంట పంట సాగుచేసే రైతుల వివరాలను వ్యవసాయ అధికారులు తీసుకొని రైతు లను అవగాహన కల్పించడంతో పాటు హెచ్చరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పంట పోలాలలో ఎండిన చెత్తకుప్పలకు మంటల పెట్ట డంతో భూమిలో ఉండే సహజమైన లవణాలతో పాటు వానపాములు మరణిస్తున్నాయి. దీంతో వర్మి కంపోస్ట్‌గా మారే భూమి అలాగే ఉండి పోతుంది. అన్నదాతలకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించ కపోవడం మూలంగానే భూసారానికి ముప్పు ఏర్పడుతుందని రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

**-కాలం మారిన అవగాహన అంతంత మాత్రమే...**

బోనకల్ మండలంలో 22 గ్రామాలకు కలిపి ఒక వ్యవసాయాధికారి, 2గ్రామాలకు, 3 గ్రామాలకు, 4 గ్రామాలకు కలిపి క్లస్టర్ పరిధిలో 6 రైతువేదికలు నిర్మాణం కాగా.. 6 మంది ఏఈఓలు గ్రామీణ పాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రోజు రోజుకు సాంకేతిక టెక్నాలిజీ అభివృద్ధి చెందుతున్న ..సమాజంలో కాలానికి అనుగుణంగా మార్పులు వస్తు న్నాయి. గతంలో కోత తరువాత వరి, మొక్కజొన్న, మిరప, పత్తి మొదళ్ల వరకు కోసేవారు. అనంతరం వాటిని పొలం గెట్లపై కుప్పలు వేసేవారు. క్రమంగా సాగు విధానంలో అనేక మార్పులు వచ్చాయి. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణలో పశువుల సంఖ్య తగ్గడం, కూలీ లకు పనిలేకుండా పోతుంది. కోత అనంతరం పోలంలో అడ్డుగా వస్తున్న సాగుతో కాలుస్తున్నారు. దీంతో పొలంలో సహజ సిద్దంగా ఉండే నత్రజని, ఫాస్పరస్ వంటి పోషకాలు తగ్గుతున్నాయి. ఫలితంగా పంట దిగుబడిపై ప్రభావం పడుతుంది. భూమికి పీచు పదార్థంగా ఉప యోగపడే అవశేషాలు మంటలో కాలిపోవడంతో పంటకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతింటున్నాయి. సాగు అనంతరం కాల్చడంతో ఒక్కోసారి జీవరాసులు ప్రాణాలకు హాని జరిగే అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా పోలాల్లో తిరిగే పాములు, తొండలు,ఉడుములు, పశుప క్ష్యాదులు చనిపోయే ప్రమాదం ఉంటుంది. పొలం గట్లుపై ఉన్న పచ్చని చెట్టు మాడిమసైపోతున్నాయి. పర్యావరణం దెబ్బతింటుంది. గాలి, నేల కలుషితమవుతున్నాయి. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తున్నాయి. సాంకేతిక టెక్నాలజీ రోజురోజుకు అభివృద్ధి చెందు తున్న సమాజంలో కాలానికి అనుగుణంగా మార్పులు వస్తున్నాయి. రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతూ.. కేవలం జీతాల కోసం పనిచేస్తున్నారా అనే సందేహాలు మండల ప్రజల్లో తలెత్తున్నాయి. ఇకనైనా అధికారుల్లో చలనం వచ్చి రైతులకు అవగాహన కల్పించ డంలో సఫలమవుతారో లేరో ఎదురుచూడాలి.

**రైతులకు అవగాహన కల్పించాలి.**
**-తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు.**



పంటల సాగు అనంతరం కొయ్యలను కాల్చడంపై రైతు సోదరులకు వ్యవసా యాధికారులు అవగాహన కల్పించాలి. ఈ విషయాన్ని ఏఈఓలు గ్రామపంచా యతీల్లో, క్లస్టర్ పరిధిలోని రైతు వేదికల్లో నిర్వహించే సమావేశాల్లో రైతులకు తెలి యజేయాలి. సాగు తర్వాత చెత్తపై నిప్పు పెట్టడం రైతులకే ఎంతో నష్టం, దిగుబడి కూడా తగ్గిపోయి రాబోయే కాలంలో భూమి దేనికి పనికిరాకుండా పోతుందనే విషయాన్ని రైతులకు అర్థమ య్యేలా చూడాలి. రైతులు నష్టపోకుండా అధికారులే అవగాహన, జాగ్ర త్తలు కల్పించాలి. రహదారుల వెంట పంటలను సాగుచేసే రైతుల సమా చారాన్ని తీసుకొని చెట్లను కాపాడుకునేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలి.

## మా రైళ్లను మాకు నడపండి

**మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వినూత్న అభ్యర్థన**



ప్రజాపక్షం/కారేపల్లి: డోర్నకల్ జంక్షన్‌నుండి భద్రాచలం రోడ్డు రైల్వే లైన్‌లో కరోనాకు ముందు నడిచిన అన్ని రైళ్ళను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేం దర్‌రెడ్డి సోమవారం కారేపల్లిలోని మహాత్మాగాంధి విగ్రహం వద్ద రైల్వే అధికారులను, ప్రజాప్రతినిధులను అభ్యర్థించారు. కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లన్నిం టిని రైల్వే ధికారులు పునరుద్దరించకపోవడమే గాక పున రుద్దరించిన ఒకటి, రెండు రైళ్ళకు కూడా కారేపల్లి రైల్వే జంక్షన్ లైన్ లోని అన్ని స్టేషన్‌లలో హాల్టింగ్ ఇవ్వలేదు. దీంతో రైల్వే లైన్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రైల్వే అధి కారులు పట్టించుకోలేదు. ఈ విషయమై అధికారులకు, ఎంపిలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవ డంతో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మా జంక్షన్ మా మేనిఫెస్టో పేరుతో ఖమ్మం పార్లమెంటు స్థానానికి పోటీ చేసే అన్ని పార్టల అభ్యర్థులకు సురేందర్‌రెడ్డి విన తిపత్రం అందించారు. ఈ రైల్వే లైన్‌లోని అన్నిస్టేషన్ లలో హాల్టింగ్ ఇప్పించాలని సురేందర్‌రెడ్డి కోరారు.

## ఉసిరికాయపల్లి సమస్యలను పరిష్కరించాలి



ప్రజాపక్షం/కారేపల్లి: వైరానియోజకవర్గ సింగరేని మండలం ఉసిరికా యలపల్లి గ్రామంలో పలు సమస్యలను వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ దృష్టికి కాంగ్రేస్ పార్టీ మండల నాయకులు బోడా రవి తీసుకెళ్లడం జరిగింది. చాలా సంవత్సరాలుగా రైతులు పొలాలకు వెళ్లా లంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు.ఎల్లబోయిన బిక్షపతి ఇంటి దగ్గర నుండి శాంతినగరం వరకు పొలాలకు వెళ్లాలంటే చాలా ఇబ్బం దికరంగా ఉంది.వర్షాకాలం వస్తూ ఉండడంతో వెళ్లే రహదారి రోడ్డు సౌకర్యం లేక అనేక సంవత్సరాల నుండి ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఉసిరికాయలపల్లిలో ఇళ్ళు లేని పేదవారు చాలామంది ఇబ్బం దులు పడుతున్నారు. కాబట్టి ఏ విషయంలో కూడా ఉసిరికాయలపల్లిపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యేకి చెప్పారు. దానికి ఎమ్మెల్యే వెంటనే స్పందిం చారు. ఎలక్షన్ కోడ్ అయిపోయాక అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి కాంగ్రేస్ పార్టీ నాయకులు బోడా రవి, బానోతు అశోక్ నాయక్ పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో పదిలో నూరుశాతం ఉత్తీర్ణత



ప్రజాపక్షం/గుండాల : గుండాలలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో 10లో(సిబిఎస్)సిలబస్ నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాదించడం పట్ల సాదించడం పట్ల ప్రిన్స్‌పాల్ చీమల సంధ్యారాణి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు మొదటి బ్యాచ్ లోనే నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాదించడాని పాఠశాల ఉపాధ్యాయులు ఎంతో కృషిచే శారని అన్నారు.

**ఇఎంఆర్ఎస్ లో ఇంటర్ దరకాస్తుల స్వీకరణ...**

ఏకలవ్యమోడల్ రెసిడెన్సియల్ స్కూల్,మరియు కళాశాలలో ఇంటర్ అడ్మిషన్‌లె ఈ నెల 18 లోపు స్వీకరించడం జరుగుతుందని విద్యార్థులు, వారి తల్లి తండ్రులు గమనించాలని సూచించారు. పదోతరగతిలో వచ్చిన మార్కుల ఆదారంగా ఎంపికలు ఉంటాయని , కౌన్సి లింగ్ ఐటిడిఏ భద్రాచలం పరిదిలో .జరుగుతాయని తెలిపారు.

## కల్లూరులో కార్యాలయాలు కళ కళ





ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని ప్రభుత్వ కార్యాలయాలు అన్ని నేటి నుంచి ప్రజల రద్దీతో కార్యాలయాలన్నీ కళకళగా మారాయి. ఆర్డీవో కార్యాలయం, జల వనరుల శాఖ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, సబ్ రిజిస్టర్ కార్యాలయం, మార్కెట్ కమిటీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ఐకెపి కార్యా లయం, వైద్యశాఖ కార్యాలయం, పంచాయతీ రాజ్ కార్యాలయం, మేజర్ పంచాయతీ కార్యా లయం, రక్షకభట కార్యాలయం తదితర కార్యాలయాలన్నీ పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో అధికారులు అందుబా టులో లేకపోవడం పార్లమెంటు ఎన్నికలు బిజీలో ఉండటం వల్ల ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడం వలన ఎన్నికల అయిపోవడం వల్ల అధికారులు ప్రజలకు అందుబాటులోకి రావడంతో పూర్తిస్థాయిలో పనులన్నీ ప్రారంభమయ్యాయి. కార్యాలయా లలో ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అవసరమయ్యే పనుల నిమిత్తం ప్రజలు గత వారం రోజుల తర్వాత నేటి నుంచి కార్యాలయాలు రద్దీగా మారాయి. గత 15 రోజుల నుంచి ఫైళ్ళని పెండింగ్‌లో ఉండటం వలన బుధవారం నుంచి ఫైళ్ళు కదలికలు ప్రారంభమైనట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.

## కల్లూరులో గ్యాస్ కష్టాలు..!



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు లోని గత ఐదు రోజులుగా గ్యాస్ సిలిండర్ బండలు లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వినియోగదారులు తెలుపుతున్నారు. కల్లూరు మండల పరిధిలోని బత్తులపల్లి ,పేరువంచ, చిన్న కోరుకొండి ,పెద్ద కోరుకొండి, చెన్నూరు, ముచ్చవరం తదితర గ్రామాలకు చెందిన గ్యాస్ సిలిండర్ వినియోగదారులు గత ఐదు రోజులుగా గ్యాస్ ఏజెన్సీల వద్ద గ్యాస్ డోర్ డెలివరీ లేనందున వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే సమయంలో ప్రైవేటు వ్యాపారస్తులు అధికంగా వసూలు చేసుకుంటున్నట్టు వినియోగదారులు తెలుపుతున్నారు. ఇదేమని అడగగా పార్లమెంట్ ఎన్ని కల సందర్భంగా రెండు రోజులు సెలవు, ఆదివారం మధ్యలో సెలవు మాకు వచ్చే దగ్గర నుంచి సరఫరా లేనందున మేము చేసేదేమీ లేదని ఏజెన్సీ నిర్వాహకులు తెలుపుతున్నారు. దీనివలన గృహిణులు ఇబ్బందులు పడుతున్నట్లు వారి పేర్కొంటున్నారు. గ్యాస్ సరఫరా లేనందున కట్టెల పొయ్యి పై భోజనం తయారు చేసుకుంటున్నట్లు వినియోగదారులు వివ రిస్తున్నారు. వినియోగదారులకు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాలని మహిళలు సంబం ధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

# కలెక్టర్ సారూ.. వైరా రిజిస్ట్రార్ కార్యాలయం వైపు జర చూడండి

-తప్పుడు రిజిస్ట్రేషన్‌లలో కీలక వ్యక్తి
అటెండర్ క్రిష్ణ మరల వైరాలో విధి నిర్వహణ
-డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కనుసైగల్లో మరల పోస్టింగ్
-అవినీతికి అండగా ఎందుకు నిలుస్తున్నారు
-1/70 యాక్ట్‌లో రిజిస్ట్రేషన్లు చేయడం తప్పు కాదా?




**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌గా ఉండి అవినీతి ఆరోపణలతో ఏప్రిల్ నెలలో జిల్లా రిజిస్టర్ ఆదేశాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వెళ్లిన అటెండర్ దుస్సా క్రిష్ణ మరల తిరిగి మే1వ తారీఖు నుండి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. జిల్లా రిజిస్టర్ కనుసైగల్లోనే మరల అటెండర్ దుస్సా క్రిష్ణ వైరాలో విధుల్లో చేరినట్లు పలువురు నోట వినిపిస్తుంది. ఇప్పటికే వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తప్పుడు రిజిస్ట్రేషన్‌లలో కీలక పాత్ర పోషించిన అటెండర్ క్రిష్ణ జిల్లా రిజిస్ట్రార్ అండదండలు నాకు ఉన్నాయి. నేను చెప్పిందే వేదం మరల వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నా సామ్రాజ్యాన్ని కొనసాగిస్తాను అన్నట్లు సమాచారం. అసలు జిల్లా రిజిస్టర్ అటెండర్ క్రిష్ణపై ఆరోపణ వచ్చిన చోట విధుల్లోకి తీసుకురావడం వెనుక ఆంతర్యం ఏమిటి. అసలు జిల్లా రిజిస్టర్ ఎందుకు తప్పుడు రిజిస్ట్రేషన్ల సూత్రధారులను వెనుకేసుకొస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా పార్టేషన్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయడం, ఏజెన్సీలో ఉన్న 1/70 యాక్ట్‌లో రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు పలు తప్పుడు రిజిస్ట్రేషన్‌లకు విరుద్ధంగా నిలయంగా మారిందని ఆరోపణలో ఉన్న నేపద్యంలోనే అధికారుల బదిలీలు చేయడం, ఆ తర్వాత బదిలీలను ఆపి చేయడం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంకు అవినీతి ఆరోపణ నేపద్యంలో అటెండర్ దుస్సా క్రిష్ణను పంపించిన జిల్లా రిజిస్ట్రార్ మరల ఆయనను వైరాకు తీసుకురావడం వెనుక పలు అనుమానాలకు తావిస్తున్నాయి. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ బాద్యతాయుతంగా విధులు నిర్వహించకపోగా అవినీతి ఆరోపణలతో ఉన్న వ్యక్తిని వెనకేసుకు వస్తున్నాడు అనే ఆరోపణలు లేక పోలేదు. జిల్లా కలెక్టర్ సారు జిల్లాలో జరుగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి ఆరోపణలపై ఒక్కసారి చూడండి వాస్తవాలు ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ ప్రాంతంలో 1/70 యాక్ట్ క్రింద రిజిస్ట్రేషన్ చేశారు. ఎన్నో సంవత్సరాల నుండి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పాతకపోయిన అటెండర్ క్రిష్ణను ఎందుకు మరల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వెనుకేసుకొస్తున్నారు ఒక్కసారి ఆలోచించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో బాధ్యతలు చేపట్టిన తర్వాత అవినీతికి తావులేదు అని పదేపదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర మంత్రులు చెబుతూ ఉంటే దానికి విరుద్ధంగా మేము చేసేంది శాసనం మేము చేసింది రిజిస్ట్రేషన్ అనే ధోరణిలో తప్పుడు రిజిస్ట్రేషన్‌లో కీలకంగా మారిన అటెండర్ క్రిష్ణపై ఎందుకు అఇకారులు అంతా ప్రేమ చూపెడుతున్నారు. దీని వెనుక ఎవరెవరి ప్రమేయం ఉంది. జిల్లా రిజిస్టర్ ఎందుకు అవినీతిని వెనుకేసుకొస్తున్నాడు ఒక్కసారి ఆలోచించాలి. నేటికి వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన తప్పుడు రిజిస్ట్రేషన్లపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు కలెక్టర్ సారో.


గతంలో విచారణ చేస్తున్న జిల్లా రిజిస్ట్రార్ (ఫైల్‌ఫొటో)

# ఇబ్బంది పెడితే నేరుగా ఫోన్ చేయండి.. వెంటనే వస్తా...

మెచ్చా నాగేశ్వరరావు పరామర్శలు



**ప్రజాపక్షం/దమ్మపేట:** మండల కేంద్రమైన దమ్మపేటలో బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పర్యటించారు. ముందుగా దమ్మపేట టౌన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు యార్లగడ్డ బాబు కుమారుడు యార్లగడ్డ శేఖర్ ఇటీవలే ప్రమాదవశాత్తు కిందపడి చికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరామర్శించారు. అనంతరం సీనియర్ నాయకులు పానుగంటి సత్యంని వారి నివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని పరామర్శించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ నాయకుడు గాజుబోయిన శ్రీను (తెలంగాణ శ్రీను)ని వారి నివాసానికి వెళ్ళి అధైర్య పడొద్దని అండగా నేను, బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ ఉంటుందని, ఎలాంటి సమయంలో ఇబ్బంది అనిపించినా వెంటనే తనకు నేరుగా ఫోన్ చెయ్యమని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, బెక్కం వెంకటేశ్వరరావు, మాజి సర్పంచ్ రాజు, వీరంకి రావు, యార్లగడ్డ శ్రీను, కౌలూరి నాగయ్య, పానుగంటి చిట్టి బాబు, కండవెల్ళి రాజు, పిట్టల లాలు ప్రసాద్, పానుగంటి గణేష్, రాంబాబు తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీ దేవిపల్లి, కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టిపిసిసి సభ్యులు, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ జెబి.శౌరి విలేకరుల సమావేశం నిర్వహించారు. జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా సహకరించారని, వారందరికి ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలో నిజమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని, భవిష్యత్తులో పలు ఇబ్బందికర పరిస్థితులకు దారి తీస్తుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో సిపిఐ అభ్యర్థికి 27వేల మెజారిటీ వచ్చిన విషయం అందరికి తెలుసని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థికి కొత్తగూడెం నియోజకవర్గంలో 60వేల మెజారిటీ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను తిట్టిన వారందరు నేడు మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన తమ ఆధిపత్యాన్ని చెలాయించే పరిస్థితినెలకొందని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. పార్టీ అధిష్టానం కూడా నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. పార్టీ జెండాను పట్టుకొని మోసిన పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డ వారి మనుడకు ముప్పు ఏర్పడిందని, కొంతమంది దగాకోరులు, తమ వ్యాపారాల కోసం పార్టీలో చేరి అసలైన కాంగ్రెస్‌వాదులపై పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. . ఈ కార్యక్రమంలో కొత్తగూడెం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం రాజశేఖర్, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అజ్మీర సురేష్‌నాయక్, ఓబిసి టౌన్ అధ్యక్షులు జయప్రకాష్, కొత్తగూడెం టౌన్ యోజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ ఉస్మాన్, జిల్లా మహిళా నాయకురాలు షబానా, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఏలూరు రాందాస్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొన్న ఖమ్మం నేతలు




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నికపై బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహాక సమావేశంలో ఖమ్మంజిల్లా నేతలు పాల్గొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ నిర్వహించిన సన్నాహాక సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తో పాటు ఎంఎల్‌సి, జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, ఎంపిలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎంఎల్‌ఎలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పట్టభద్రుల ఎంఎల్‌సి ఉప ఎన్నిక పై చర్చించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల ప్రచారం తదితర అంశాల గురించి కేటిఆర్ దిశా నిర్దేశం చేశారు.

# కోరం పుల్లయ్య దశదిన కార్యక్రమానికి హాజరైన మదన్‌లాల్



**ప్రజాపక్షం/కారేపల్లి:** కోరం పుల్లయ్య దశదిన కార్యక్రమానికి బిఆర్‌ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ హాజరయ్యారు. ఇల్లందు నియోజకవర్గం శాసనసభ్యులు కోరం కనకయ్య తండ్రి కోరం పుల్లయ్య దశదిన కార్యక్రమానికి కోయగూడెం గ్రామం నందు హాజరై వారి చిత్రపటానికి బానోతు మదన్‌లాల్ పూలమాల వేసి నివాళులుఅర్పించారు.

# ఆరోగ్య ఉప కేంద్రానికి కుర్చీల వితరణ




**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండం విశ్వనాధపల్లి ప్రాధమిక ఆరోగ్య ఉప కేంద్రానికి విశ్వనాధపల్లికి చెందిన షేక్ పెద్ద షరీఫ్ కుర్చీలను బుధవారం వితరణ చేశారు. తన తండ్రి నవాబ్ జ్ఞాపకార్ధం 10 కుర్చీలను షేక్ పెద్ద షరీఫ్ ఉప కేంద్రం వైద్యురాలు డాక్టర్ మహేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా షరీఫ్‌ను విశ్వనాధపల్లి గ్రామ ప్రజలు అభినందించారు. వైద్యురాలు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి అవసరమైన సేవా కార్యక్రమాలు చేయడానికి ధాతలు షరీఫ్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు రావాలని పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వల్లభనేని ప్రభాకర్‌రావు, తాతా వెంకటేశ్వర్లు, వల్లభనేని మురళి, ఏఎన్‌ఎం అంజలి తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాపకార్థ కూడికలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో తెలంగాణ పొలిటికల్ వింగ్ అధ్యక్షులు, ఎన్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్ బావ మరిది కీ.శే. కొలకనూరి జోసెఫ్ కుమార్ జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూరాలని ప్రార్ధన చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న రైతులకు

# సత్వరమే నష్టపరిహారం చెల్లించాలి

### తుమ్మలకు వినతిపత్రం అందజేసిన సిపిఐ బృందం



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల పరిధిలోని హిమాంనగర్ నుండి ఏన్కూరు ఎన్ఎస్‌పి కాల్వ వరకు జరుగుతున్న సీతారామ ప్రాజెక్ట్ లింక్ కెనాల్ కాల్వ పనులను పరిశీలించడానికి వచ్చిన వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్‌కుమార్ మంత్రితతో మాట్లాడుతూ ఈ కాల్వ క్రింద భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధరలకు అనుగుణంగా ఒక ఎకరానికి రూ.30లక్షలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ కాల్వ క్రింద భూములు కోల్పోయిన రైతుల వివరాలు , ఎంత భూములు కోల్పోతున్నారు అనే వివరాలు ఇంకా అధికారులు ప్రకటించకుండా పనులు జరగడంతో రైతుల్లో ఆందోళన నెలకొందని మంత్రికి తెలిపారు. తక్షణమే స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రైతులందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు అమరనేని వీరభద్రం, సీనియర్ నాయకులు మేడా భూషయ్య, ఏఐటియుసి జిల్లా నాయకులు మంకెన కృష్ణ, రైతు నాయకులు తాళ్లూరి రమణ, భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

# మాట్లాడుకుందాం రండి...





**-మంత్రి పొంగులేటి సరికొత్త పంథా**
**-ఒక్కో రోజు ఒక్కో మండలం**
**-ప్రతి గ్రామంలో 20 నిమిషాలు సమావేశం**
**-ఈనెల 17 నుంచి 20 వరకు**
**మంత్రి పొంగులేటి పాలేరులో పర్యటన**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. క్యాంపు కార్యాలయానికి బాధితులను రప్పించుకునే అవసరం లేకుండా పాలేరు నియోజక వర్గ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకునేందుకు ఆయా గ్రామాల్లో పర్యటించనున్నారు. తొలి విడతలో ఈనెల 17 నుంచి 20 వరకు వరుసగా నాలుగు రోజుల పాటు పాలేరు నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపిక చేసిన పలు గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళిక రూపొందించుకున్నారు. 17న ఖమ్మం రూరల్ , 18న నేలకొండపల్లి, 19న తిరుమలాయపాలెం , 20న కూసుమంచి మండలాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజల వద్దకే పాలన అందిస్తామని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ బాధితులు తిరగాల్సిన అవసరం లేదని చెబుతూ వస్తుంది. ఇదే తరహాలో మంత్రి పొంగులేటి సైతం తనను ఎంఎల్‌ఏగా గెలిపించి శాసనసభకు పంపించిన పాలేరు నియోజక వర్గ ప్రజల రుణం తీర్చుకోవడానికి ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. నేరుగా ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వీలున్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించేలా తగు ప్రణాళికలను రూపొందించారు.

**ఒక్కో గ్రామంలో 20 నిమిషాలు...**

పాలేరు నియోజక వర్గంలోని నాలుగు మండలాలు ఉండగా ఒక్కో మండలంలో 30కు పైగా గ్రామాలు ఉన్నాయి. వాటిలో తొలి విడతలో ప్రతి మండలంలో 15 నుంచి 18 గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సైతం స్థానిక ప్రజలతో కలిసి చేసేలా తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో 20 నిమిషాల పాటు సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఆ సమావేశంలో బాధితుల నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నేరుగా వినతులు స్వీకరించి అక్కడికక్కడే పరిష్కరించబడే వాటిని సత్వరం పరిష్కరించేలా తగు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు.

# వృద్ధ దంపతుల మృతి పట్ల పలువురి నివాళి



**ప్రజాపక్షం/ మధిర :** బోనకల్ రోడ్డులోని ముష్టికుంట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వృద్ధ దపంతులు రిటైర్డ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొత్తూరు సూర్యనారాయణ, రుక్మిణి అకాల మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. బుధవారం మధిరలోని వారి స్వగృహం నందు రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్య వైశ్యులు కొత్తూరు సూర్యనారాయణ(93), సతీమణి రుక్మిణి భౌతికాయాన్ని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే మధిర పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు వృద్ధ దంపతుల మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్థూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు రావి కోటేశ్వరరావు, సిపిఎం నాయకులు కట్టా గాంధీ, విశ్రాంత ఎంపిడిఓ మాధవరపు నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మిరియాల రమణగుప్తా, ఆర్యవైశ్య సంఘం నాయకులు చారుగుండ్ల నర్సింహామూర్తి, వనమా కిరణ్, పలువురు పట్టణ ఆర్యవైశ్య నాయకులు తదితరులు ఉన్నారు.

# బొడ్డురాయి సందర్భంగా 20 కుటుంబాలు బహిష్కరణ

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** గ్రామంలో బొడ్డురాయి ఏర్పాటు విషయంలో చందాలు ఇవ్వలేదని సుమారు 20కుటుంబాల వారిని కుల బహిష్కరణ చేసినట్లు చల్లా దుర్గయ్య అనే వ్యక్తి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని వడ్డెరరంగాపురం గ్రామంలో బిసి సామాజిక వర్గం( వడ్డెర) కులస్థులు గ్రామ సుభిక్షత కోసం బొడ్డురాయి ఏర్పాటుకు ఒక్కో ఇంటికి రూ.3వేలు చందా చెల్లించాలని గ్రామ పెద్దలు హుకుం జారీ చేశారు. దీంతో చల్లా దుర్గయ్య, మరికొన్ని కుటుంబాలకు చెందిన మేము చర్చికి వెళ్తున్నామని ఈ కార్యక్రమానికి చందా ఇవ్వలేమని చెప్పటంతో కుల బహిష్కరణ చేసి కుటుంబాలతో ఎవరూ మాట్లాడకూడదని, ఇరుగుపొరుగులాంటి కార్యక్రమాలు చేపట్టకూడదని దుకాణాల వద్ద సరుకులు లాంటివి ఇవ్వకూడదని పెద్దలు హుకుం జారీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కాలంలో కూడా ఇటువంటి కుల బహిష్కరణపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

# మధిర కోర్టును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర కోర్టును బుధవారం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధిర పాత కోర్టు ప్రాంతంలో నూతన కోర్టు భవన సముదాయల నిర్మాణ పనులకు నిధులు మంజూరైన విషయం విధితమే. దీనిలో భాగంగా జిల్లా జడ్జి రాజగోపాల్ కోర్టు పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించే విధంగా ఉన్నతాధికారులకు నివేదికలను అందచేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర జూనియర్ సివిల్ జడ్జి కార్తీక్‌రెడ్డి, న్యాయవాదులు, ఇతర కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య దశదిన కర్మలకు హాజరైన జెడ్‌పిటిసి దంపతులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యులు కోరం కనకయ్య తండ్రి పుల్లయ్య(80) ఇటీవల కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. కాగా బుధవారం టేకులపల్లి మండలంలోని కోయగూడెం గ్రామంలో గల వారి నివాసానికి జెడ్‌పిటిసి దంపతులు కామిరెడ్డి శ్రీలత, కామిరెడ్డి రామకొండారెడ్డిలు వెళ్లి దశ దిన కర్మలకు హాజరై, మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఆళ్లపల్లి ఎంపిపి కొండ్రు మంజు భార్గవి, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# న్యాయవాదుల సంక్షేమ నిధులు మంజూరు పట్ల హర్షం

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** న్యాయవాదుల సంక్షేమ నిధులు మంజూరు పట్ల జిల్లా కాంగ్రెస్ లీడల్ సెల్ నాయకులు, ప్రముఖ యువ న్యాయవాది భజన సతీష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు . ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదాల సంక్షేమ నిధులు మంజూరు తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమం వారి నైతిక అభివృద్ధే ధ్యేయంగా ప్రజాపాలనలో భాగంగా మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా రూ 100కోట్లు మంజూరుకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్‌రెడ్డిని, అలాగే రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ కమిటీ ఛైర్మన్ పొన్న అశోక్‌గౌడ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# నేడు శ్రీ సద్గురు ఆశ్రమం ఆచటపీఠంలో లక్ష సీడ్ బాల్స్ తయారీ

**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో గల శ్రీ సద్గురు ఆశ్రమం ఆచలపీఠంలో లక్ష సీడ్ బాల్స్ గురువారం తయారీ చేయడం జరుగుతుందని సద్గురు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గాజర్ల వీరభద్రం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణగౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

# రిప్లెస్‌మెంట్ పామాయిల్ మొక్కల పంపిణీ

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** 2020 నుండి 2024 వరకు ఫామాయిల్ సాగు చేపట్టిన రైతులకు రిప్లెస్ మొక్కులు ఇవ్వనున్నట్లు ఫామాయిల్ డివిజన్ మేనేజర్ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు డివిజన్ కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని సూచించారు.